# జైలు కథలు II



## వ్యామోహం

"ఘల్లుమనె విల్లు........ విస్మయము గదరా!" కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి శివధనుర్భంగం పద్యం చదువుతూ, అందున్న సౌలభ్యానికి ఆనందిస్తున్నాను. మనస్సు పులకరించింది.

"మిమ్మల్ని ఎవరో పిలుస్తున్నారు" వర్తమానంలోకి వచ్చి పరికించి చూశాను. మా బ్లాక్‌లోని ఖైదీ.

"ఎవరు– ఎక్కడ?"

"బయట రాములవారి ఆలయం పక్కనే వున్నాడు. క్రొత్తగా వచ్చినట్లున్నాడు." ఖైదీ జవాబు విని పుస్తకం ప్రక్కన పెట్టి, అతనితో బయటకు నడిచాను.

బయట రాములవారి ఆలయం ప్రక్కనే వున్న సిమెంటు గచ్చు పైకూర్చొని వున్నాడో యాభై సంవత్సరాల వ్యక్తి. మనిషి గంభీరంగా, హుందాగా వున్నాడు. వేష భాషలనుబట్టి కాస్త స్థితిమంతుడే అని పిస్తుంది. ఆయన్ను చూడగానే ఒక విధమైన పూజ్యభావం కల్గింది నాలో. నారాకను సైతం గమనించకుండా ఏదో ఆలోచిస్తున్నాడు. "నమస్తే" అన్నాను. "నమస్తే....ండి....నేనే పంపాను అతన్ని మీకొరకు" చాల సంస్కారంతోగూడిన మాటలు.

"విషయం చెప్పండి".... ప్రారంభించాడు.

..................

సూర్యనారాయణగారు రిటైర్డు తహసీల్దారు. ఉన్నది మంచి సంపాదన కవకాశం ఉన్న పోస్టేగాబట్టి రెండువేపులా బాగానే సంపాయించారు. ఒక్కగానొక్క కొడుకు సుధీర్. బి. ఏ. చదివినా ఉద్యోగం చేయడానికి యిష్టపడలేదు. చిన్నతనంనుంచి గారాబంగా పెరిగినవాడు. డబ్బు బాగా ఖర్చు చేయడానికి అలవాటుపడ్డవాడు. అయినా సుమారు ఒక సంవత్సరం నుంచి హైదరాబాద్ వెళ్ళి వస్తున్నాడు. డబ్బు బాగా తెస్తున్నాడు. ఎక్కడిదని తల్లిదండ్రులడిగితే ఏదో వ్యాపారం చేస్తున్నా నన్నాడు. కాని ఏ వ్యాపారానికైనా అంత రాబడి వుండదు. అయినా కొడుకు మీద వున్న ప్రేమతో మాట్లాడేవారు కాదు. ఆదాయం విపరీతంగా పెరిగిపోయింది. అయినా అతని చేష్టలను బట్టి నల్లధనంగా గమనించారు తల్లీ తండ్రి. ఇంక చాలు ఆ వ్యాపారం ఆపమన్నారు. కాని సిరిరా మోకాలడ్డవన్నాడు సుధీర్. రాకపోకలు తగ్గలేదు, ఆదాయం తగ్గలేదు.

ఒక రాత్రి ఎక్సైజువారు అకస్మాత్తుగా దాడి చేశారు ఇంటిపై. ఇంట్లో నేలమాళిగలో దాచిన ధనం యావత్తు స్వాధీనం చేసుకొన్నారు. సూర్యనారాయణగారినిఅరెస్టు చేసి తీసికొనివెళ్ళారు వెళ్ళిన తరువాత అదే లాక్అప్‌లో వున్న సుధీర్ తండ్రిని చూచి భోరుమన్నాడు. తండ్రి సముదాయించి విషయం సుధీర్ ద్వారా గ్రహించారు. సుధీర్ కొందరి సహాయంతో మైసూరు నుండి చందనం హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నాడు. ఇది చాలాకాలం నిర్విఘ్నంగా సాగింది. కాని మూడు రోజుల క్రితం మైసూరు నుండి వస్తున్నారు. ఎంబాసిడర్ కారులోని డిక్కీ నిండుగా చందనం కట్టె వుంది. కర్నూలు దాటబోయేటప్పుడు పోలీస్ యూనిఫారంలో వున్నతను ఎస్.ఐ. లాగా వున్నాడు–స్టాప్ సిగ్నల్ యిచ్చాడు. కాని సుధీర్ ఆపలేదు. ఎస్. ఐ. తన వద్ద వున్న మోటార్ బైక్‌పై ఫాలో అయాడు. చాలా దూరం వెంటాడాడు. ఇంక అవకాశం ఇవ్వదలచలేదు సుధీర్. పిస్టల్‌తో కాల్పులు సాగించాడు. అంతే.... 'అమ్మా' అనే కేక.... మోటార్ బైక్ క్రింద పడ్డ శబ్దం వినిపించింది. నిండుగా గాలి పీల్చుకున్నాడు సుధీర్. కాని తన పని తనకే ఎదురు తిరిగింది. బిజినేపల్లి వద్ద సుమారు 20 మంది కారాపి చుట్టుముట్టారు. తప్పించుకొనే మార్గం లేకపోయింది. పట్టుబడ్డాడు. తరువాత తెలిసింది, చావుబ్రతుకుల మధ్య వున్న ఎస్. ఐ. వేరే కారు సహాయంతో వెనక్కి వెళ్ళి విషయాన్ని జడ్చర్ల పోలీసులకు తెలియపర్చాడు. వారు బిజినేపల్లివద్ద కాపుగాచి పట్టుకున్నారు.

సుధీర్ యిచ్చిన అడ్రస్‌తో యింటిపై దాడిజరిగింది. "అంతా అయిపోయింది..." అంతటి గంభీరమైన మనిషికూడ విచారంతో గొంతు పూడుకుపోగా, అతికష్టం మీద మాట్లాడ గలిగాడు.

"మరి సుధీర్ ?" ప్రశ్నించాను.

"అతనికి సాయపడిన ముఠా గురించి ఆరా తీయడానికి హైదరాబాద్ తీసుకు వెళ్ళారు....ఇంటరాగేట్ చేస్తారేమో?" అనుమానంతో కూడిన ప్రశ్న.

"భయంలేదు. ఉన్నది వున్నట్లు చెబితే సుధీర్‌ను యేమీచేయరు."

"ఏమో ప్రసాద్! నా పలుకుబడి, డబ్బు ఉపయోగించినా ధన దాహం తెచ్చిన ఈ కేసు నుంచి బయటపడలేనేమోనని పిస్తుంది" మెల్లగా అన్నాడు.

"భయపడి మనసు పాడుచేసుకోకండి. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది." చేతగాక వుపశమనం కోసం అనే మాట అనుకోకుండా అనేశాను.

—ప్రసాద్